సాక్షి గుంటూరు

శనివారం । 19 । జూలై । 2025



పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

బొల్లాపల్లి: వినుకొండ నుంచి 20 మందితో మర్రివేముల వెళుతున్న ఆర్టీసీ బస్సు వెల్లటూరు వద్ద ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఎవరూ గాయపడలేదు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 563.10 అడుగులకు చేరింది. ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

శాకంబరిగా భవానీ అమ్మవారు



సత్తెనపల్లి: ఆషాఢ మాసం పురస్కరించుకొని స్థానిక అమ్మిశెట్టివారివీధిలో ఉన్న త్రికోటేశ్వర స్వామి గుడిలో భవానీ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

'స్వచ్ఛ' అవార్డు రావడం అభినందనీయం



గుంటూరు వెస్ట్ / నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాకు అవార్డు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. గుంటూరు నగరానికి వచ్చిన అవార్డును జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌కు చూపారు. ఇది సమష్టి కృషి ఫలితం అని కలెక్టర్ అన్నారు.

కేంద్రం నుంచి 'సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ 2024–25' పోటీల్లో గుంటూరుకు లభించిన అవార్డు నగర ప్రజలు, ప్రజారోగ్య కార్మికులకు అంకితమని మేయర్ కె.రవీంద్ర చెప్పారు. శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ అవార్డు అందించిన స్ఫూర్తితో సమగ్రాభివృద్ధి సాధిస్తామని తెలిపారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ అందరి కృషితోనే గుర్తింపు లభించిందన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పెదకాకాని: శివాలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ముగిశాయి. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేడుకల చివరిరోజైన శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పర్యవేక్షణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాగా, 20వ తేదీన శ్రీ భ్రమరాంబ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి విశేష పూజలు చేయనున్నారు. స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, దాతలు నేలవెల్లి కోటీశ్వరి, కర్నే శివ సందీప్ నాగశిరీష, రెడ్డి నవీన్ కుమార్ విజయలక్ష్మి, నేలివెల్లి నాగప్రత్యూష, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ స్థలాన్ని పరిశీలించిన పల్నాడు కలెక్టర్



విజయపురి సౌత్: మేకల గొంది నుంచి జల జీవన్ మిషన్ ద్వారా రూ.1,200 కోట్లతో మాచర్ల నియోజకవర్గంతోపాటు పల్నాడు ప్రాంతానికి కూడా తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబంధిత స్థలాన్ని అధికారులు పరిశీలించారు. మేకల గొందిలో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసే స్థలంలో సర్వే మ్యాపులను పరిశీలించారు. అన్ని అనుమతులు మంజూరయితే నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణ, డీఎఫ్ఓ సందీప్ కుమార్, మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్, ఇరిగేషన్ ఈఈ రమేష్ పాల్గొన్నారు.

చౌడేశ్వరి అమ్మవారికి సారె సమర్పణ



రెంటచింతల: స్థానిక చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం ఆషాఢ మాస పుట్టింటి చీరసారెను సమర్పించారు. ప్రత్యేక అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు పి.అనిల్‌కుమార్‌శర్మ నేతృత్వంలో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం పెద్దశెట్టి పల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక శ్రీ రాములవారి ఆలయం వద్ద నుంచి మేళతాళాలతో ఆషాఢ మాస పుట్టింటి చీరసారెను భక్తులతో కలిసి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు.



గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డులో ప్రత్తిపాడు కళాశాల వద్ద లోలెవల్ చప్టాపై ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగు

కుండపోత



ఇందిరాగాంధీ బొమ్మ సెంటరులో వీధుల్లోకి వచ్చిన వర్షపునీరు

- లోతట్టు ప్రాంతాలు, సాగు భూములు జలమయం
- గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డులో మునిగిన లోలెవల్ చప్టా
- మూడు జిల్లాల మధ్య నిలిచిపోయిన రాకపోకలు
- ప్రత్తిపాడులో తూముల సమస్యతో ఇళ్లలోకి చేరిన మురుగునీరు

ప్రత్తిపాడు: మండలంలో కుండపోత వర్షం కురిసింది. గురువారం రాత్రితోపాటు శుక్రవారం ఉదయం నుంచి కూడా విడతలవారీగా 40.4 మి.మీ. భారీ వర్షపాతం నమోదైంది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం మొదలు ప్రత్తిపాడు బస్టాండు వరకు గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డు చెరువును తలపించింది. మోకాలి లోతులో నీరు రోడ్లపై ప్రవహించడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. వాగులు, లోలెవల్ చప్టాలు ఉప్పొంగాయి. గొట్టిపాడు- ప్రత్తిపాడు, గనికపూడి-గొట్టిపాడు మధ్యనున్న లోలెవల్ చప్టాలపై వర్షపు నీరు ఉప్పొంగింది. ఆయా గ్రామాల మధ్య రాకపోకలు కొన్ని గంటలపాటు స్తంభించిపోయాయి. ప్రత్తిపాడు, పాతమల్లాయపాలెం, ఏబీపాలెం, వంగిపురం ప్రాంతాల్లో సాగు భూములు సైతం వర్షపు నీటితో చెరువులను తలపించాయి. గుంటూరు - పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై ప్రత్తిపాడులో ఎస్ఎంఎస్ అండ్ ఎస్ఎల్ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న లోలెవల్ చప్టాపై పెద్ద ఎత్తున నీరు ఉప్పొంగడంతో బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నివాసాల్లోకి మురుగునీరు..

ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో పాతమల్లాయ పాలెం కూడలి వద్దనున్న చిన్న తూముల వలన రెడ్ల రామాలయం నుంచి ఇందిరా గాంధీ బొమ్మ సెంటరు వరకు వర్షపు నీరు, మురుగు ఎగదన్ని ఇళ్లలోనికి, అంతర్గత వీధుల్లోకి వచ్చింది. ఇంటి సామగ్రి దెబ్బతింది. రోడ్లపై నీరు మోకాలి లోతులో ప్రవహించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తూముల సమస్యను అధికార యంత్రాంగం పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో అధిక వర్షాలకు సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై ప్రత్తిపాడు పంచాయతీ అధికారులకు కూడా శుక్రవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.



ఏబీపాలెం సమీపంలో పొలాల్లో పెద్ద ఎత్తున చేరిన వర్షపు నీరు



జలమయమైన ప్రత్తిపాడు మెయిన్ రోడ్డు

ఏ'మార్చి' విధుల్లో వైద్యులు

పేద రోగులకు సేవలందించాల్సిన వైద్యులు వారు.. కానీ, సేవ మాట దేవుడెరుగు.. కనీసం అధికారికంగా విధులు నిర్వర్తించడంలోనూ నిర్లక్ష్యం చూపుతున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ఉండాల్సిన వారు.. డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంబంధం లేని విధుల్లో ఉంటున్నారు. ఇక ఉన్న సిబ్బందిలో మరికొందరు ఎక్కడంటే అక్కడకు వెళ్లినా హాజరు సైతం నమోదు అయ్యేలా మేనేజ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

- ఆరోగ్య కేంద్రానికి వెళ్లకుండా డీఎంహెచ్ఓ కార్యాలయంలో తిష్ట
- అసలు విధులు మర్చిపోయి కార్యాలయ ఉద్యోగుల పనుల్లో నిమగ్నం
- వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు



డీఎంహెచ్ఓ కార్యాలయం

గుంటూరు మెడికల్: గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి తక్షణ వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం మెడికల్ ఆఫీసర్‌లను నియమించింది. గతంలో ఒక్కొక్కరు ఆరోగ్య కేంద్రాల్లో ఉండేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇద్దరు చొప్పున నియమించింది. ఆరోగ్య కేంద్రాల పనివేళలు పెంచి స్టాఫ్ నర్సులను అదనంగా ఏర్పాటు చేసింది. పీహెచ్‌సీలో కీలకమైన పలువురు మెడికల్ ఆఫీసర్లపై ఆరోగ్య కేంద్రాలకు వెళ్లడం లేదని, రోగులకు సేవలు చేయడం లేదని డీఎంహెచ్ఓకు, జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు వచ్చాయి. వారిపై మాత్రం ఎలాంటి చర్యలు లేవు. పని తీరు పర్యవేక్షించి ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు సేవలు అందించేలా చూడాల్సిన ప్రోగ్రాం ఆఫీసర్లు అసలు ఆ విషయమే మరిచిపోయారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలోనే తిష్ట వేసిన ఆరోగ్య కేంద్రాల సిబ్బందిపై ఉన్నతాధికారులు సైతం చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హాజరు నమోదు చూస్తారట..

పీహెచ్‌సీల్లో రోగులకు సేవలందించాల్సిన ఓ డాక్టర్ ఇలా డీఎంహెచ్ఓ కార్యాలయంలో తిష్ట వేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది హాజరును పర్యవేక్షించే పనులు నిర్వహిస్తున్నారు. పరిపాలనా అధికారులు, మినిస్టీరియల్ ఉద్యోగులు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలి. దీంతో వీరు డమ్మీలుగా మారారు. వాస్తవానికి ఆరోగ్య కేంద్రాల్లో ఉండి వైద్యులు, వైద్య సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ మొబైల్ ద్వారా వేయాలి. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడంతో గుంటూరులో ఉన్నా, ఇళ్లల్లో ఉన్నా హాజరు నమోదవుతోంది. ఈ మేరకు డేటా మార్చారు. ఫిర్యాదులు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు. అర్బన్ పీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో పనిచేయాల్సిన వైద్యులు కొంత మంది దొడ్డి దారిలో డీఎంహెచ్ఓ కార్యాలయ అధికారులను మంచి చేసుకుని, గుంటూరులోనే తిష్ట వేస్తున్నారు. కొందరికైతే ఏ పనీ ఉండటం లేదు. హాజరు వేసి ఇళ్లకు వెళ్లిపోయి సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. మరికొందరు సంబంధం లేని పనులు చేస్తున్నారు. ఉన్నతాధికారులు సదరు వైద్యుల నుంచి లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

చర్యలకు వెనకడుగు

ఇటీవల జిల్లాలోని ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణి చికిత్స కోసం వచ్చిన సమయంలో ఓ మెడికల్ ఆఫీసర్ రెండు కాళ్లు టేబుల్ మీద పెట్టి సెల్‌ఫోన్ చూసుకుంటూ కాలక్షేపం చేసిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయినప్పటికీ అతడిపై డీఎంహెచ్ఓ కార్యాలయం చర్యలు తీసుకోలేదు. మరో వైద్య అధికారి మద్యం తాగి విధులకు హాజరవుతూ దుర్భాషలాడుతున్నారని పలువురు వైద్య సిబ్బంది డీఎంహెచ్ఓకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. ఆరోగ్య కేంద్రాలకు రాని కొందరు వైద్య అధికారులను మార్చాలని ప్రజలు, రోగులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారే లేరు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్య అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆదర్శ న్యాయ'జ్యోతి'

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ప్రత్యేకత
- నేడు తెనాలిలో మొవ్వా విజయ లక్ష్మి స్మారక అవార్డు ప్రదానం



జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

తెనాలి: ట్రాన్స్ ఉమన్‌కు సంతానోత్పత్తి సామర్థ్యం లేదనే కారణంతో 'మహిళ'గా పరిగణించడానికి వీల్లేదన్న వాదనను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇటీవల తిరస్కరించింది. స్త్రీత్వాన్ని సంతానోత్పత్తికి పరిమితం చేసే సంకుచిత భావన రాజ్యాంగ స్ఫూర్తిని తక్కువ చేసి చూడటమేనని తెలిపింది. లింగ భేదంతో సంబంధం లేకుండా పౌరులకు హుందాగా, తగిన గుర్తింపుతో, సమానత్వంతో జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందని తన తీర్పులో గుర్తుచేసింది. ఈ తీర్పునిచ్చి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప తన ప్రత్యేకత చాటారు.

ఎక్కడున్నా ప్రతిభలో మేటి..

జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సొంతూరు తెనాలి. తల్లిదండ్రులు బాలత్రిపురసుందరి, పీవీ కృష్ణశాస్త్రి. ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు తెనాలిలోనే చదివారు. విజయవాడ మాంటిస్సోరి మహిళా కాలేజీలో న్యాయ డిగ్రీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీజీ, ఆంధ్రా వర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. కాలేజీలో, వర్సిటీలో టాపర్‌గా బంగారు పతకాలు అందుకున్నారు. మహిళల విభాగంలో, ఫైనలియర్‌లో టాపర్‌గా మరో రెండు స్వర్ణాలు వచ్చాయి.



న్యాయ అకాడమీ నుంచి బంగారు పతకం స్వీకరిస్తున్న దృశ్యం (ఫైల్)

వృత్తిపరంగానూ ప్రత్యేక గుర్తింపు

రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో 1997లో అడ్వొకేట్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. న్యాయవాది కాజ రామమోహనరావు వద్ద నైపుణ్యం సాధించారు. 2008లో జిల్లా జడ్జిగా నియమితులయ్యారు. అయిదో బంగారు పతకాన్ని హైదరాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ న్యాయ అకాడమీ నుంచి అందుకున్నారు. జిల్లా జడ్జిగా రాష్ట్ర వ్యాప్తంగా పలు న్యాయస్థానాల్లో పని చేశారు. నెల్లూరులోని 3వ అదనపు జిల్లా కోర్టు జడ్జిగా, సికింద్రాబాద్ కుటుంబ కోర్టు, 1989లో కర్నూలులోని ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రత్యేక న్యాయస్థానం, సీబీఐ కేసులు విచారించే విశాఖపట్నంలోని ప్రత్యేక న్యాయస్థానం, ఆంధ్రప్రదేశ్ వి.ఎ.టి. అప్పిలేట్ ట్రిబ్యునల్‌లోనూ విధులు నిర్వర్తించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థకు 'ప్రధాన గీతం' రచించారు. కరోనా కాలంలో న్యాయ సేవాధికార సంస్థ తరఫున సేవలకు ఆమె చూపిన చొరవకుగాను అభినందన పత్రాన్ని కూడా అందుకున్నారు.

విదేశాల్లోనూ శిక్షణ

అమెరికాలోని కాలిఫోర్నియా, ప్రేగ్, చెక్ రిపబ్లిక్‌లలోని ఫెడరల్ న్యాయకేంద్రం (ఎఫ్‌జేసీ), వాషింగ్టన్, సెంట్రల్ అండ్ ఈస్టర్న్ యూరోపియన్ ఇనీషియేటివ్ సంస్థ ప్రేగ్‌లోనూ 'సైబర్ క్రైమ్స్' అంశంపై 'శిక్షకులకు శిక్షకురాలు'గా ఎంపికయ్యారు. ఆమె భర్త డాక్టర్ వంగల శ్రీనివాస్. ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసి విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి కుమార్తె శైలజ సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. కుమారుడు సత్య ఇంజినీరింగ్ అభ్యసించనున్నారు. తెనాలిలో డి.ఇందిర మున్సిపల్ హైస్కూలులో చదివేటప్పుడు వ్యాయామ ఉపాధ్యాయినిగా ఉన్న తన గురువు మొవ్వా విజయ లక్ష్మి పేరిట 4వ అవార్డును ఇప్పుడు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి స్వీకరించనుండటం విశేషం. శనివారం ఉదయం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

మానవ హక్కుల సంఘం రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్‌గా లక్ష్మి

నాదెండ్ల: ప్రపంచ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ మహిళా విభాగ వైస్ చైర్‌పర్సన్‌గా నాదెండ్ల మండలం గణపవరం గ్రామ వాసి మందపల్లి లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ఢిల్లీలోని కేంద్ర కార్యాలయం అధ్యక్షుడు ఆర్.బాలరాజు నుంచి ఉత్తర్వులు అందాయి. ఆమె మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని పేర్కొన్నారు.

నానో ఎరువుల వినియోగం పెంచాలి

జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న అయితా నాగేశ్వరరావు

కొరిటెపాడు(గుంటూరు): నానో ఎరువుల వినియోగం పెంచాలని కేంద్ర ప్రభుత్వం సూచించిందని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇఫ్కో ఆధ్వర్యంలో కృషీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన నానో ఎరువుల విక్రయదారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నానో యూరియా, డీఏపీ, జింక్, కాపర్ వాడటం వల్ల కాలుష్యం తగ్గుతుందని స్పష్టం చేశారు. ధరల భారం ఉండదన్నారు. రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూమి సారం కోల్పోతుందని తెలిపారు. జిల్లా సహకార అధికారి వీరాచారి మాట్లాడుతూ నానో ఎరువులను రైతులు వాడాలని సూచించారు. ఒక బాటిల్ నానో యూరియా పిచికారి చేస్తే ఒక బస్తా యూరియా చల్లినట్టేనని తెలిపారు. ఇఫ్కో నానో డీఏపీ అన్ని పంటల్లో నత్రజని, భాస్వరం లోపాలను సరిచేయడంలో సహాయ పడుతుందని వివరించారు. సమావేశంలో నాబార్డు డీడీఎం శరత్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, ఇఫ్కో జిల్లా మేనేజర్ రఘు సురేంద్ర, సహకార సంఘాల సీఈఓలు పాల్గొన్నారు.

వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుంటూరు నగరం, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లోని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 6 దుకాణాల్లో రూ.4.92 లక్షల విలువైన 1.13 టన్నుల ఎరువులు, ఏడు దుకాణాల్లో రూ.4,400 విలువైన 27.5 లీటర్ల పురుగు మందులు, 6 షాపుల్లో రూ.23.60 లక్షల విలువ గల 82.3 మెట్రిక్ టన్నుల విత్తనాల అమ్మకాలను సరైన పత్రాలు చూపని కారణంగా నిలిపివేశారు. దీంతోపాటు రూ.1.29 లక్షల విలువైన 78.57 లీటర్ల పురుగు మందులను స్వాధీనం చేసుకుని 6–ఏ కేసులు నమోదు చేశారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు


గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,500

మోడల్ ధర రూ. 1,200

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	40,141
అమ్మకాలు	44,297
నిల్వ	3,365

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-13,600
సూపర్ -10	10,000-13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	9,500-12,800
నంబరు-5	10,000-13,500
341	10,000-13,700
4884	10,000-12,400

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,400
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 10,800
తాలుకాయలు	5,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,700
దేవనూరు డీలక్స్	10,000 - 12,600
తాలు	5,200 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

మేడికొండూరులో 36.4 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా మేడికొండూరు మండలంలో 136.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా పెదకాకాని మండలంలో 7.2 మి.మీ. పడింది. సగటు 45.4 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. గుంటూరు తూర్పులో 96.4 మి.మీ., గుంటూరు పశ్చిమ 94.6, కొల్లిపర 60.2, తెనాలి 58.2, వట్టిచెరుకూరు 56.2, చేబ్రోలు 44, దుగ్గిరాల 43.6, ప్రత్తిపాడు 40.4, పెదనందిపాడు 34.2, ఫిరంగిపురం 29.8, మంగళగిరి 29.4, కాకుమాను 26.4, పొన్నూరు 19.4, తుళ్ళూరు 18.4, తాడికొండ 14.6, తాడేపల్లి మండలంలో 7.8 మి.మీ. చొప్పున వర్షపాతం కురిసింది. జూలై 18వ తేదీ నాటికి జిల్లా సాధారణ వర్షపాతం 95.8 మి.మీ. వర్షపాతం పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 59.3 మి.మీ. నమోదైంది.

రక్తం కళ్లజూసి..
కసిదీరా హతమార్చి..



- ప్రత్యర్థులను అతి క్రూరంగా చంపేస్తున్న దుండగులు
- నగలు, నగదు లక్ష్యంగా ప్రాణాలు బలి తీసుకుంటున్న చోరులు
- మంగళగిరి, తెనాలి, దక్షిణ సబ్ డివిజన్లలోనే ఎక్కువ దారుణాలు

నగరంపాలెం: జిల్లాలో చోటుచేసుకుంటున్న వరుస హత్యలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు ఇరవై మంది దారుణ హత్యకు గురయ్యారు. వివాదాలు, పాతకక్షలు, నగలు, నగదు దోపిడీ కోసం దుండగులు ఇలా తెగబడుతున్నారు. దీంతో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. మద్యం మత్తు కూడా ఈ హత్యలకు కారణంగా నిలుస్తోంది.



పేరేచర్లలో హత్యకు గురైన బాలకృష్ణ (ఫైల్)



చేబ్రోలులో హత్యకు గురైన గోపయ్య (ఫైల్)

ఎందుకీ క్రూరత్వం?

నిందితుల్లో ఎక్కువగా సుమారు 30- 40 ఏళ్లలోపు వారే. ప్రత్యర్థులను కిరాతకంగా హతమార్చారు. తాడేపల్లి సీతానగరం పట్టాభిరామయ్యకాలనీలో ఓ వ్యక్తిని క్రూరంగా చంపేశారు. క్రైం సినిమాల్లో మాదిరి అతని మెడలో కత్తి దించి అలజడి సృష్టించారు. ఇక మంగళగిరి ఎంఎస్‌నగర్ వాసి కోటేశ్వరరావు చేతి మణికట్టులను కత్తులతో నరికారు. ఆనందపేటలో జరిగిన పఠాన్ ఖాజాబి హత్యతో కొద్ది రోజులు స్థానికులు రాకపోకలకు హడలిపోయారు. పెదనందిపాడు మండలం పుసులూరు గ్రామ వాసి శ్రీనివాసరావును హత్య చేసి పంట కాల్వల్లో పడేశారు. వంద గొర్రెలను ఎత్తుకెళ్లారు. తెనాలిలో వియ్యపురాళ్లు ప్రాణాలతో బయటపడేందుకు ప్రత్యర్థులతో పెద్ద పెనుగులాటే జరిగింది. చివరికి ప్రాణాలు వదిలారు. ఓ వృద్ధురాలిపై లైంగిక దాడి చేసి, హత్య చేశారు. మేడికొండూరు మండల పరిధిలో ముగ్గురు మందుబాబులు ఒకర్ని బీరు సీసాలతో అత్యంత పాశవికంగా హత్య చేశారు. హతమార్చే దృశ్యాలు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు.

నియంత్రణకు చర్యలు అంతంతే

జిల్లాలో ఇలాంటి కేసుల నియంత్రణకు చేపడుతున్న చర్యలు అంతంత మాత్రమేనని చెప్పాలి. గుంటూరు సమాచార సేకరణలో స్పెషల్ బ్రాంచి, ఇంటెలిజెన్స్ వెనుకంజలో ఉండటమే దీనికి కారణమనే అనుమానాలు లేకపోలేదు. మంగళగిరి, తెనాలి, దక్షిణ సబ్ డివిజన్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. సబ్ డివిజన్‌కు ఐదారుకుపైగా హత్యలు జరిగాయి. రాజధాని ప్రాంతమైన జిల్లా, గుంటూరు నగరంలో ప్రోటోకాల్, బందోబస్తులతో పోలీసులకు ఊపిరాడటం లేదు. క్షేత్రస్థాయిలో తగిన సిబ్బంది లేరు.

ఇవిగో నిదర్శనాలు

- ఏప్రిల్ 1న అరండల్‌పేటలో భిక్షాటన చేసుకునే కేవీపీ కాలనీ వాసి గణేష్ (35)ను ముగ్గురు స్నేహితులు హతమార్చారు. గణేష్‌పై నగరంపాలెం పీఎస్‌లో సస్పెక్ట్ రౌడీషీట్ ఉంది.
- ప్లాస్టిక్ సీసాలు ఏరుకునే శారదాకాలనీ వాసి దారావతు రాము (60), రెడ్డిపాలెం వాసి బట్టు రాజులు కలిసి మద్యం తాగి గొడవ పడ్డారు. రాజు మద్యం సీసాతో రాముపై దాడి చేసి హతమార్చాడు.
- ఆనందపేట రెండో వీధిలో ఉంటున్న వంట మాస్టర్ పఠాన్ హర్షద్ ఓ యువతి తనను ప్రేమిస్తున్నట్లు చెబుతుండగా ఏప్రిల్ 3న గొడవ జరిగింది. హర్షద్‌ను హతమార్చేందుకు యువతి తరఫు వారు మారణాయుధాలతో వెంటపడ్డారు. క్షతగాత్రులను చూసేందుకు వెళ్లిన పఠాన్ ఖాజాబి (70)ని ప్రాణాలు కోల్పోయింది.
- ఏప్రిల్ 28న పేరేచర్ల నరసరావుపేట రోడ్డులోని రైల్వేట్రాక్ పక్కనున్న తోటలో మంగళగిరికి చెందిన బాలకృష్ణ (40)ను బీరు సీసాలతో తలపై మోది ముగ్గురు హత్య చేశారు. 2019లో జరిగిన ఓ హత్య కేసులో వీరు నిందితులు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి.
- మే 2న దుగ్గిరాల మోరంపూడి గ్రామంలో రఘునాథరావు (35), గోపీలు మద్యం తాగి గొడవ పడ్డారు. రఘునాథరావు తలపై రోకలి బండతో గోపీ మోదడంతో మృతి చెందాడు.
- మే 7న మంగళగిరి ఎంఎస్ఎస్‌గర్‌కు చెందిన కోటేశ్వరరావు (47)ను పెదవడ్లపూడి సమీపంలో దారుణంగా హత్యచేశారు. పీక కోయవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- జూన్ 3న తెనాలి అయ్యప్పస్వామి గుడి వద్ద ఒంటరిగా ఉంటున్న తాడిపత్రి మల్లీశ్వరి (60)పై హత్యాచారం జరిగింది. ఆమెకు చెందిన బంగారు నగలతో దుండగులు పారిపోయారు.
- జూన్ 19న తెనాలిలో వియ్యపురాళ్లు దాసరి రాజేశ్వరి (65), పి.అంజమ్మ (70)లను దారుణంగా హత్య చేసిన దుండగులు, బంగారు నగలు దోచుకెళ్లారు.

ఆధునిక సెన్సార్లతో విద్యుత్తు హెచ్చుతగ్గుల నియంత్రణ

పెదకాకాని: ఎలక్ట్రికల్ స్మార్ట్ గ్రిడ్లలో అధునాతన సెన్సార్‌లను వినియోగించడం ద్వారా విద్యుత్ హెచ్చుతగ్గులను నియంత్రించవచ్చని ఏపీ ట్రాన్స్‌కో అండ్ ఏపీఎస్‌ఎల్‌డీసీ చీఫ్ ఇంజినీర్ డాక్టర్ శ్రీనివాస్ కవటూరి అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా' ఆధ్వర్యంలో అధునాతన సెన్సార్లను వినియోగించి స్మార్ట్ గ్రిడ్ శక్తి, ఉత్పత్తి, పంపిణీ, వినియోగాన్ని విశ్లేషించడంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ శ్రీనివాస్ కవటూరి, డెప్యూటీ ఈఈ ఆర్‌వీఆర్ సంతోష్, ఐఈఐ ఏపీ సెంటర్ చైర్మన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ హాజరయ్యారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ పరికరాలు కాలపరిమితిని కూడా పెంచవచ్చని తెలిపారు. ఏఐ ఆధారిత బిగ్ డేటా ద్వారా విద్యుత్ ఉత్పత్తి, వినియోగం మధ్య వ్యత్యాసాన్ని విశ్లేషించి భవిష్యత్ అవసరాలు గుర్తించేందుకు వీలవుతుందని వివరించారు. డాక్టర్ శ్రీనివాస్ కవటూరి, ఆర్‌వీఆర్ సంతోష్‌లను వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబులు సత్కరించారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ సరేష్‌బాబు, ఐఈఐ విద్యార్థి విభాగం సంధాన కర్త డాక్టర్ సీహెచ్ నాగసాయి కళ్యాణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీనివాస్ కవటూరిని సత్కరిస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

రేషన్ బియ్యం పట్టివేత

పట్నంబజారు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ కాలనీ నుంచి రెడ్డిపాలెంకు చెందిన ఏడుకొండలు అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. సుమారు 40 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలం తురిమెళ్ల తూర్పు కాలువలో శవం కనిపించడంతో గ్రామస్తులు శుక్రవారం గ్రామ వీఆర్వోకు దృష్టికి తీసుకెళ్లారు. వీఆర్వో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవితేజ తెలిపారు.

పాత పింఛను విధానం అమలుకు డిమాండ్



గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు వెస్ట్: పాత పెన్షన్ విధానాన్ని 2003 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని అమలు చేయాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మోపిదేవి శివశంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. తమకు నోటిఫికేషన్ వచ్చే నాటికి ఓపీఎస్ విధానం అమలు కాలేదన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన టెక్నికల్ తప్పుల వలన తాము తీవ్రంగా నష్టపోయామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 57 ఇదే అంశాన్ని ధ్రువీకరిస్తోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సకాలంలో స్పందించకపోతే తమ న్యాయ పోరాటం ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సలగల ప్రసన్న కుమార్, ఘంటసాల శ్రీనివాసరావు, నరసింహారావు, శ్రీలం యలమంద, మారెళ్ళ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ కేసులో విచారణకు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి హాజరు

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత నెల 18వ తేదీన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన నేపథ్యంలో జన సమీకరణ చేశారంటూ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డిపై సత్తెనపల్లిలో మరో అక్రమ కేసు నమోదైంది. ఈ నెల 11న మొదటి కేసు విషయమై సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఆ సమయంలో రెండో కేసు ఊసును పోలీసులు ఎత్తలేదు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు రెండో కేసు నమోదు చేసి ఈ నెల 16న విచారణకు హాజరు కావాలంటూ హడావుడిగా నోటీసులను గుంటూరుకొచ్చి అందించారు. దీనిలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్సీ విచారణ నిమిత్తం సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషనుకు హాజరై, సీఐ ఎంవీ సుబ్బారావు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఆయన వెంట పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, పల్నాడు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షురాలు రోళ్ల మాధవి, నాయకులు మందపాటి శేషగిరిరావు, చల్లంచర్ల సాంబశివరావు, రమావత్ కోటేశ్వరరావు నాయక్, షేక్ మౌలాలి, అచ్యుత శివప్రసాద్, గుజ్జర్లపూడి సతీష్, గుజ్జర్లపూడి కృపారావు తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షా ఫలితాలే కీలకం

- వాటి ఆధారంగా పంటకు నత్రజని ఎరువులు వాడాలి
- జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కొరిటెపాడు(గుంటూరు): భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా రైతులు పంటల్లో నత్రజని ఎరువులు వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కలకు కావాల్సిన ముఖ్య పోషకాల్లో నత్రజని కీలకమన్నారు. ఇది అమ్మోనియం, నైట్రేట్ రూపాల్లో దొరుకుతుందని పేర్కొన్నారు. పైరు పెరుగుదల సమయంలో దుబ్బులు చేయడంలోనూ, కొమ్మలు తొలగడంలోనూ ఈ ఎరువు ప్రభావం ఉంటుందని తెలిపారు. ఆకులు కూడా ముదురాకు పచ్చని రంగుతో ఆరోగ్యంగా కనిపిస్తాయని వెల్లడించారు. నత్రజని తగినంత ఉన్నప్పుడు మిగిలిన పోషకాలు కూడా సమర్థంగా అందుతాయని చెప్పారు. నత్రజని ఎరువులను అవసరమైన మేరకే మూడు దఫాలుగా వాడాలని, అధికంగా వేస్తే పైరు విపరీతంగా పెరిగి పడిపోవడం, పూత ఆలస్యంగా వచ్చి పంట కాలం పెరగడం, తాలు గింజల శాతం అధికం కావడం, చీడపీడలకు సులభంగా గురికావడం, దిగుబడి తగ్గిపోవడం జరుగుతుందని వివరించారు. నత్రజని లోపించినప్పుడు మొక్కల పెరుగుదల నెమ్మదిగాను, పొట్టిగాను ఉండిపోవడం, ఆకులు పాలిపోయి పసుపు పచ్చగా మారడం, ఫలసాయంలో మాంసకృతుల శాతం తగ్గిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు. లోపం తీవ్రంగా ఉన్నప్పుడు ఆకుల కొనల నుంచి మధ్య వరకు క్రమంగా మాడిపోవడం, ముదురు ఆకులు ముందుగానే పసుపుగా మారి ఎండిపోయి రాలిపోవడం, పూత బాగా తగ్గి తక్కువ దిగుబడి రావడం జరుగుతుందన్నారు. నత్రజని ఎరువులను పంటలకు అందించడానికి యూరియా లేదా అమ్మోనియం సల్ఫేట్ లేదా కాల్షియం అమ్మోనియం నైట్రేట్ లేదా అమ్మోనియం క్లోరైడ్ తదితర ఎరువులను వేసుకోవాలని సూచించారు. సమతుల ఎరువుల వాడకం భూసార పరీక్షల వల్ల మాత్రమే సాధ్యపడుతుందని చెప్పారు. భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా నత్రజని ఎరువులను ఉపయోగించాలని ఆయన తెలిపారు.

మైక్రో ఆర్టిస్ట్ మహితకు బాపట్ల కలెక్టర్ సాయం

బాపట్ల : చీరాలకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ అన్నం మహిత జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలిశారు. తన అద్భుతమైన కళా ప్రతిభతో మహిత 93 పెన్సిల్స్‌పై నెల్సన్ మండేలా జీవిత చరిత్రను, మరో 810 పెన్సిల్స్‌పై మహాభారతంలోని 700 శ్లోకాలను అత్యంత సూక్ష్మంగా చెక్కి అందరి ప్రశంసలు అందుకున్నారు. మహిత అసాధారణ ప్రతిభను కలెక్టర్ మురళి అభినందించారు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, తన వంతు సహాయంగా రూ.15వేలు చెక్కు రూపంలో మహితకు అందజేశారు. కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య యాదవ్ పాల్గొన్నారు. కళాకారులను ప్రోత్సహించడంలో భాగంగా కలెక్టర్ తీసుకున్న ఈ చొరవను పలువురు అభినందిస్తున్నారు.



రేపు పల్నాడు జిల్లా స్థాయి చెస్ పోటీలు

మాచర్ల: అంతర్జాతీయ చదరంగం పోటీలను పురస్కరించుకొని ఈ నెల 20న ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు పట్టణంలోని కోదండ రామాలయంలో వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ, పల్నాడు చెస్ అకాడమి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు కోచ్ కిరణ్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులకు పోటీల వివరాలు తెలిపారు. రూ. 100 ఎంట్రీ ఫీజు కట్టి పాల్గొనాలన్నారు. మొదటి 10 స్థానాల్లో నిలిచిన వారికి నగదు, ట్రోఫీలు ఇస్తామని పేర్కొన్నారు. 7,9,11,13,15 వయసు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి, ముగ్గురు బాలికలకు పతకాలు బహుమతిగా ఇస్తామని తెలిపారు. 9390059759 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సమాచార కాలమ్

30 వరకు దూరవిద్య ప్రవేశాలకు అవకాశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో దూర విద్య టెన్త్, ఇంటర్‌లలో ప్రవేశానికి ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లు నిండి, చదువు మధ్యలో ఆపేసిన అభ్యర్థులు పదో తరగతిలో, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్‌లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. రెగ్యులర్ టెన్త్, ఇంటర్‌లలో ఫెయిలైన వారు చేరవచ్చని, 2025-26 విద్యాసంవత్సరానికి ఈ నెల 30 వరకు ప్రవేశాలకు అవకాశం ఉందని వివరించారు. సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు మండల విద్యాశాఖాధికారులను సంప్రదించాలని సూచించారు. ఏపీఓఎస్ఎస్‌లో గుర్తింపు పొందిన అధ్యయన కేంద్రాల జాబితాను డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.ఇన్ సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు తమకు సమీపంలోని అధ్యయన కేంద్రంలో అడ్మిషన్ కోసం నమోదు చేసుకోవాలని సూచించారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: జోన్-3 పరిధిలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్ ఓరియెంటల్ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న అధ్యాపకులను 2025-26 విద్యాసంవత్సరానికి రెన్యువల్ చేసేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు కళాశాల విద్య ఆర్జేడీ పి. కళావతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యంలో 39, ఓరియెంటల్‌లో 10 చొప్పున పోస్టులను రెన్యువల్ చేసేందుకు గత విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 30వ తేదీ వరకు పని చేసిన 60 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

పిల్లల సంరక్షణపై సర్టిఫికెట్ కోర్సు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల హోం సైన్స్ విభాగంలో నానీ కేర్ అండ్ న్యూట్రీషన్ (పిల్లల సంరక్షణ)పై ఏడాది వ్యవధి గల సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను 2025-26 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూట్రీషన్, చైల్డ్‌కేర్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. చేరేందుకు ఆసక్తి కలిగిన పదో తరగతి, ఆపై విద్యార్హతలు ఉన్న వారు అడ్మిషన్ పొందవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 90592 00037, 95420 32539 ఫోను నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు పేరేచర్లలోని క్రీడా మైదానంలో జూనియర్, సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్లను నల్లమల జోన్ లీగ్ మ్యాచ్‌లకు పంపిస్తామన్నారు. సీఆర్ఎస్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 73375 85790లో కోచ్ బ్రహ్మంను సంప్రదించాలని సూచించారు.